క్లుప్తంగా

నేడు గంధోత్సవం

కడప కల్చరల్ : కడప పెద్దదర్గాలో బుధవారం ఖాజా యే ఖాజుగా నాయబే రసూల్ అత్తాయే రసూలుల్లా హజరత్ ఖాజా సయ్యద్ షా పీరుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుస్సేని చిస్టివుల్ ఖాద్రి సాహెబ్ గంధం ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి ఈ ఉత్సవం ప్రారంభం కానుందని దర్గా ప్రతినిధులు తెలిపారు. మొహర్రం నెల 10వ రోజు గురువులు జీవ సమాధి పొందిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

ఆంగ్ల విభాగంలో డాక్టరేట్


దస్తగిరి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ పరిశోధకులు బండి సుల దస్తగిరికి వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీ యూ ఆంగ్ల విభాగం సహ ఆచార్యులు డాక్టర్ ఎస్ అంకన్న పర్యవేక్షణలో 'అరుంధతిరాయ్'స్ సెలెక్టెడ్ వర్క్స్ : ఏ స్టడీ' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. దస్తగిరి వీరపునాయనిపల్లె మండలం పాయసంపల్లె గ్రామానికి చెందినవారు.

నేడు 'మానస వీణ' పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన జీఎల్ లావణ్య రచించిన మానస వీణ పుస్తకాన్ని బుధవారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ, జమ్మలమడుగు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి.నారాయణరెడ్డి ఆవిష్కరించనున్నారని రచయిత్రి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సభకు కడప నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథిగా ఆవిష్కర్త నారాయణరెడ్డి పాల్గొంటారన్నారు. రాజంపేట పూర్వ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మినారాయణ పుస్తక పరిచయం చేస్తారని తెలిపారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి


డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఎస్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేని కారణంగా విద్యార్థులకు సరైనబోధన అందడం లేదన్నారు. చాలామంది ఉపాధ్యాయులు రిటైర్డ్ అయిన కారణంగా ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందన్నారు. సత్వరమే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ జిల్లా కార్యదర్శులు బాలకృష్ణ, శ్రీరామ్, సలాం, రవిశంకర్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం నాయకులు మంగళవారం కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ మాట్లాడుతూ కరువు ప్రాంతమైన జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో ప్రకటించారన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 10 వేలు, పరోక్షంగా 25 వేలు మందికి మేలు చేకూరుతుందన్నారు. దీనికి అనుబంధంగా మరికొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, నాయకులు విజయ్, రవితేజ, లుక్మాన్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష పథకం పరిధిలో జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వెంటనే వేతనాలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్ ఖాన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మండల విద్యా వనరుల కేంద్రాలలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మే, జూన్ నెలలకు సంబంధించి వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టణానికి.. జబ్బు చేసింది



పిల్లలను పీడిస్తున్న రోగాలు

ఇక్కడ ఇద్దరు పిల్లలతో ఉన్న ఆమె పేరు ముంతాజ్. కడప నగరం మోచంపేటలో నివసిస్తోంది. తమ పిల్లలకు విరేచనాలు, జ్వరం ఎంతకూ తగ్గకపోవడంతో ఆసుపత్రికి వచ్చింది. దోమల బెడద ఎక్కువగా ఉందని.. అందువల్ల జ్వరాలతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని ఆమె వేదన చెందుతోంది. చాలా మంది పిల్లలు రోగాలతో బాధపడుతున్నట్లుగా తెలిపింది.

విరేచనాలతో వృద్ధుల విలవిల



ఇక్కడ బెడ్‌పై చికిత్స చేయించుకుంటున్న వృద్ధురాలి పేరు రహ్మద్ బీ. విరేచనాలతో పట్టణ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతోంది. రెండు రోజుల నుంచి అనారోగ్యంగా ఉంటే చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చింది.

ఇళ్ల మధ్య మురుగు.. వ్యాధులకు నెలవు


లోహియానగర్‌లో డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

నగర పరిధిలోని చాలా వీధుల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇళ్ల మధ్య మురుగు నీరు నిల్వ ఉంటోంది. వాన నీరు ఎటూ పోయేందుకు దారిలేక ఇలా వీధుల్లో నిల్వ ఉంటోంది. ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరుగుతూ దోమలకు ఆవాసంగా మారుతోంది.


కడప నగరం బుడగజంగం కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న వర్షపు నీరు

దోమల వల్ల ఆస్పత్రి పాలవుతున్నాం



కడప నగరంలోని 48వ డివిజన్ లోహియానగర్‌లో బుడగజంగం కాలనీలో ఇళ్ల మధ్య మురికి నీరు నిల్వ ఉంటోంది. దీని వల్ల దోమలు ప్రబలి అనేకమంది ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. కొన్ని వీధుల్లో సీసీ రోడ్లు, కాలువలు ఉన్నా, మరికొన్ని వీధుల్లో డ్రైనేజీ కాలువలు లేవు. ఇళ్ల మధ్య డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో ఇబ్బందిగా ఉంది. ఖాళీ స్థలాల్లో ఉన్న డ్రైనేజీ నీటిని తొలగించి కాలువలు లేని చోట డ్రైనేజీ కాలువలను నిర్మించాలి. - డి.సుబ్బమ్మ, లోహియానగర్, కడప

డ్రైనేజీలోని వ్యర్థాలు తొలగించాలి



ప్రకాశ్‌నగర్‌లోని మెయిన్‌రోడ్డులో కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు సత్వరమే తొలగించాలి. వ్యర్థాల వల్ల నీరు ఎటూ పోకుండా అలాగే నిలబడిపోవడంతో దోమలు వ్యాపించడంతోపాటు దుర్వాసన వస్తోంది. దోమల వల్ల రోగాలు వస్తున్నాయి. - నన్నయ్య, ప్రకాశ్‌నగర్, కడప


కడప రిమ్స్ జనరల్ మెడిసిన్ ఓపీ విభాగంలో రోగులను పరిశీలిస్తున్న డాక్టర్ పవన్ కుమార్

కడప రూరల్/ కడప అర్బన్/ కడప కోటిరెడ్డి సర్కిల్: సీజనల్ వ్యాధులు కడప పట్టణ వాసులపై దాడి చేస్తున్నాయి. విరేచనాలు, వాంతులు, మలేరియా, తదితర వైరల్ జ్వరాలతో జనం ఆసుపత్రుల బాట పడుతున్నారు. జ్వరాలు చాలా రోజుల వరకూ తగ్గకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

అపరిశుభ్రత కారణంగా...

వానలకు అపరిశుభ్రత తోడైంది. దోమల మోత ప్రారంభమైంది. ఫలితంగా ప్రజలు మలేరియా తదితర వైరల్ ఫీవర్స్‌కు గురవుతున్నారు. ప్రధానంగా చిన్నారులను విరేచనాలు, వాంతులు పీడిస్తున్నాయి. ఇందుకు కలుషితమైన తాగు నీరు తదితర కారణాలని వైద్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం చాలా మంది ప్రైవేట్ వైద్యులు, ఆర్ఎంపీలను సంప్రదిస్తున్నారు. ఆర్థికంగా చితికిపోతున్నారు.

– కడపలో ప్రభుత్వ రంగానికి సంబంధించి సర్వజన ఆసుపత్రితో పాటు అబ్దుల్‌నబీ స్ట్రీట్, ఆలంఖాన్‌పల్లె, అక్కాయపల్లె, నాగరాజుపేట, పాత కడప, భగత్‌సింగ్ నగర్, ఫక్కీర్‌పల్లె, ఎన్జీఓ కాలనీ, అగాడి స్ట్రీట్, రాధాక్రిష్ణనగర్, రవీంద్రనగర్, ఎర్రముక్కపల్లె, వికలాంగుల కాలనీలో మొత్తం 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.


రిమ్స్ జనరల్ మెడిసిన్ ఐపి విభాగంలో వైద్య సేవలను పొందుతున్న వివిధ రకాల వ్యాధి గ్రస్తులు

జాగ్రత్తలు తీసుకోవాలి....



సీజనల్ వ్యాధుల కాలంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పని సరిగా వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలి. తాగు నీటిని కాచి చల్లార్చి తాగాలి. దోమలు కుట్టకుండా, అవి పుట్టకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు. - డాక్టర్ అనిత శ్రీ, కడప


గౌస్ నగర్ సమీపంలో మురికి కాలువ


ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం సమీపంలో డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు


ఆర్టీసీ బస్టాండు ఔట్‌గేటు సమీపంలో కాలువ దుస్థితి ఇలా..

రాహుకాల పూజలు



కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించండి

కడప ఎడ్యుకేషన్: ద్విచక్ర వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి ప్రయాణం చేయాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శాంత పేర్కొన్నారు. కడప జేఎంజే జూనియర్ కళాశాలలో మంగళవారం ద్విచక్ర వాహన వినియోగదారులు రక్షిత హెల్మెట్ ఉపయోగించడంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా సురక్షితంగా గమ్యాన్ని చేరాలంటే ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారుడు తమ ప్రాణాలనే కాకుండా కుటుంబ సంక్షేమాన్ని కూడా గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఖచ్చితంగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు.

విద్యార్థులు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని హెల్మెట్‌ను వాడాలన్నారు. అనంతరం గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎంజే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రోసిరాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను ఖండిస్తున్నాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దళిత వర్గాలపై అగ్రవర్ణాల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు గుడిసె దేవానంద్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో దేవానంద్ మాట్లాడారు. నేటి పరిస్థితుల్లో కూడా కులాన్ని అడ్డుపెట్టుకుని పెత్తనం చలాయించడం బాధాకరమన్నారు. ఒంటిమిట్ట మండలంలో కదిరి ప్రభాకర్ అనే దళితుడు సేద తీరేందుకు అరుగుపై కూర్చొంటే కాగుతున్న నూనె తీసుకొచ్చి వేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి, ఎస్సీ యువమోర్చా రాజంపేట జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేయడం అమానుషం

రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ప్రతి నిత్యం దళితులపై దాడి జరగడం అమానుషమని ఏపీ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు జాకట విజయశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామానికి చెందిన దళితుడు కదిరి ప్రభాకర్‌పై దాడి చేయడంతో ఆయన రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయనను మంగళవారం విజయశేఖర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులను కోరారు.

ఉయ్యాలవాడ విగ్రహ ఆవిష్కరణకు అనుమతి ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్‌జిల్లా పులివెందుల పట్టణంలో స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్ర ఆవిష్కరణ కోసం స్థలం కేటాయించాలని, విగ్రహ ఆవిష్కరణకు అనుమతిని మంజూరు చేయాలని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు యారపురెడ్డి సురేంద్ర రెడ్డి, స్టేట్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గారి పురుషోత్తం రెడ్డి కోరారు. ఈ విషయమై మంగళవారం కడప జిల్లా విగ్రహ కమిటీ మెంబర్ అయిన జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ప్రొద్దుటూరు డీఈ జీఎంఆర్‌రెడ్డి, పొద్దుటూరు పంచాయతీరాజ్ కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాలవ శ్రీలత రెడ్డి, నేషనల్ కన్వీనర్ నల్లపురెడ్డి వెంగళ రెడ్డి పాల్గొన్నారు.

పీర్ల చావిడిలో ప్రత్యేక ప్రార్థనలు



కడప కల్చరల్ : కడప నగరం హోమియోపతి కాలేజ్ వద్దగల ఏఎస్ఆర్ నగర్‌లో మంగళవారం పీర్ల చావిడి మకాన్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం మొహరం సందర్భంగా పీర్ల చావిడిలో ప్రార్థనలు నిర్వహించనున్నారు. ముందస్తు ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమ నిర్వాహకులు మహబూబ్‌బాష ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయవాది బీఎస్ అక్బర్ అలీఖాన్ హాజరమయ్యారు.